
ప్రజాశక్తి
ఆదివారం 3 మార్చి 2024
5
పార్వతీపురం మన్యం



ప్రశాంతంగా సెకెండ్ ఇంటర్ పరీక్ష

పార్వతీపురంరూరల్ : ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజుల వీణ తెలిపారు. 5893 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 317మంది గైర్హాజరయ్యారు. 5576 మంది హాజరై పరీక్షలు రాశారన్నారు. అలాగే వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి 2907 మంది రాయాల్సి ఉండగా 2622 మంది హాజరయ్యారని, 285 మంది గైర్హాజరు అయ్యారని ఆమె వివరించారు. జిల్లాలో మొత్తం 32 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

సీతానగరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ రెండవ తరగతి పరీక్ష జరుగుతున్న నేపథ్యంలో స్థానిక తహశీల్దార్ జనార్దన్ రావు పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. 280 మంది విద్యార్థులు గాను 252 మంది పరీక్షకు హాజరయ్యారు. 28 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డివిజిస్ త్రినాధరావు తెలిపారు.

ఇఎస్ఎంఎస్ యాప్‌పై శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సాధారణ ఎన్నికల్లో విధులు నిర్వహించే తనిఖీ బృందాల సిబ్బంది ఎన్నికల సంఘం రూపొందించిన ఎన్నికల జప్తు నిర్వహణ వ్యవస్థ (ఇఎస్ఎంఎస్)యాప్‌పై పూర్తి అవగాహన ఉండాలని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. సాధారణ ఎన్నికల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో తనిఖీ బృందాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికల కమిషను ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఎప్పటికప్పుడు మార్పులు, సాంకేతికత అందుబాటులోనికి తీసుకొస్తుందని తెలిపారు. అందులో భాగంగా తనిఖీ బృందాలు విధులకు సంబంధించి ఎన్నికల సమయంలో జప్తుచేసిన డబ్బు, ఇతర వస్తువులకు సంబంధించి ఎన్నికల జప్తు నిర్వహణ వ్యవస్థ (ఇఎస్ఎంఎస్) యాప్ రూపొందించిందన్నారు. తనిఖీ బృందాల వారు పట్టుకున్న డబ్బు, ఇతర వస్తువులను ఈ యాప్‌లో తప్పని సరిగా నమోదు చేయాలని, కావున యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కల్పించుకోవాలని తెలిపారు. బ్యాంకుల నుండి అధికార కార్యకలాపాల కొరకు లేదా ఇతర అవసరాల కోసం అధిక మొత్తంలో డబ్బులు డ్రా చేస్తే ఆ డబ్బులకు సంబంధించిన క్యూఆర్ కోడ్ ఇస్తారని, దాన్ని ఈ యాప్ ద్వారా ధ్రువీకరణ చేసుకోవచ్చునని తెలిపారు. సాధారణ ప్రజలు ఎంతవరకు డబ్బులు కలిగిఉండవచ్చు, ఎంత మొత్తం సీజ్ చేయవచ్చు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తమ అధికార పరిధికి లోబడి విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా పనిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల విధులు, యాప్ నిర్వహణపై అనుమానాలను వెంటనే నివృత్తి చేసుకోవాలని, తనిఖీ బృందాల సభ్యులతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకొని వారి సందేహాలను అందులో తెలియజేస్తే, వాటికి వెంటనే సమాధానాలు తెలియజేస్తామని, తద్వారా అందరు సభ్యులకు అవగాహన కలుగుతుందని తెలిపారు.

ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ తనిఖీ అధికారులు తనిఖీల్లో పట్టుబడిన, సీజ్ చేసిన వివరాలను తప్పనిసరిగా ఎన్నికల జప్తు నిర్వహణ వ్యవస్థ (ఇఎస్ఎంఎస్)యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. జప్తు అనంతరం తీసుకునే చర్యలు ఈ యాప్‌లో నమోదైన వివరాలు ఆధారంగానే ఉంటాయని కావున, సిబ్బంది ఎన్నికల సమయంలో పట్టుకొన్న ప్రతి కేసు వివరాలను ఈ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ జి.కేశవరావు, తనిఖీ బృందాల నోడల్ అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎండి గయాజుద్దీన్, తనిఖీ బృందాల అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పుపై ప్రతిపాదనలు

జిల్లాలో ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాల్లో అదనంగా సహాయక కేంద్రం ఏర్పాటు, పోలింగ్ కేంద్రం పేరు మార్పు, లొకేషన్ మార్పుపై ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన ఛాంబరులో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1031 పోలింగ్ కేంద్రాలను 769 పోలింగ్ స్టేషను ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని, వాటిలో 244 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పునకు, 26 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పునకు ప్రతిపాదనలు సమర్పిస్తున్నట్లు చెప్పారు. ఇందులో పాలకొండ నియోజ వర్గంలో 120 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పునకు, 12 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పునకు, కురుపాంలో 5 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పునకు, 8 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పునకు, పార్వతీపురంలో 87 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పునకు, 2 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పునకు, సాలూరులో 32 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పునకు, 4 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పునకు ప్రతిపాదనలు వచ్చాయని, వాటి ఆమోదానికి పంపిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవనాయుడు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్

చీపురుపల్లిలో మారుతున్న సమీకరణాలు

- టిడిపి నుంచి పోటీకి తప్పకున్న గంటా?
- ముందుకు రాని కళా
- ఎట్టకేలకు ప్రచారంలో దిగిన నాగార్జున



కర్లాంలో సమావేశానికి హాజరైన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగార్జున

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చీపురుపల్లి టిడిపిలో రాజకీయ సమీకరణాలు మలుపు తిరుగుతున్నాయి. ఇక్కడి నుంచి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును రంగంలోకి దింపేందుకు పార్టీ ఆదేశించినప్పటికీ ఆయన సున్నితంగా తిరస్కరించినట్టు ప్రచారం జరుగుతోంది. రెండో ప్రాధాన్యతలో పరిశీలించిన మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు కూడా ముందుకు రాలేదని సమాచారం. దీంతో, ఓవైపు విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పేరును పరిశీలిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్న ప్రటికీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున మాత్రం రోజు క్రితం తిరిగి నియోజకవర్గానికి చేరుకుని కర్లాం గ్రామంలో పర్యటించారు. దీంతో, అధిష్టానం దిశ మార్చినట్లుగా, తిరిగి నాగార్జునకు అభయం ఇచ్చినట్టు తెలుస్తోంది. వాస్తవానికి నాగార్జున తొలి నుంచీ చీపురుపల్లి నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉన్నారు. ఇదే నియోజకవర్గంలో వైసిపి నుంచి రాజకీయంలో ఆరితేరిన మంత్రి బొత్స సత్యనారాయణ ఉన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్, వైసిపి జిల్లా సమన్వయ కర్తగా కూడా ఇదే నియోజకవర్గం పరిధిలోని మెరకముడిదాం జెడ్‌పిటిసిగా ఉన్నారు. వీరిని ఢీకొంటూ పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నాగార్జున టిడిపి కేడర్‌లో ఉత్సాహాన్ని నింపారు. దీంతో, ఇటీవల జరిగిన శంఖారావం సభకు జిల్లాలో మిగిలిన నియోజకవర్గాలకన్నా ఎక్కువ మంది ఒకింత ఉత్సాహంగా హాజరయ్యారనడంలో సందేహం లేదు. ఓడిన చోటే గెలవాలన్నది తన లక్ష్యమంటూ నాగార్జున తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. దీంతో, కేడర్ కూడా నాగార్జునకే టిక్కెట్ వస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. కానీ, బొత్స ప్రభావాన్ని విజయనగరం, విశాఖపట్నం పార్లమెంట్ స్థానాల్లో తగ్గించాలన్న వ్యూహంతో అధిష్టానం గట్టిపోటీ ఇవ్వగలిగేవారిని దింపాలని భావించింది. బొత్స గెలుపుపై భయాందోళన కలిగించాలంటే గంటా శ్రీనివాసరావువే గెలుపు గుర్రమని కూడా భావించింది. అదే విషయాన్ని వెల్లడించిన గంటా తాజాగా చీపురుపల్లి వెళ్లలేనని పార్టీకి తేల్చిచెప్పినట్టుగా సమాచారం. అయితే, గంటాకు ప్రత్యామ్నాయ నియోజకవర్గం అంటూ చూపకపోతే చీపురుపల్లి నుంచి దిగుతారా? లేక పోటీలో లేకుండా ఉండిపోతారా అన్నది వేచిచూడాల్సిందే. ఇక నాగార్జున పెదనాన్న కళా వెంకటరావు పేరును కూడా రెండో ప్రాధాన్యతలో అధిష్టానం పరిశీలించినప్పటికీ ఆయన సున్నితంగా తిరస్కరించినట్టు సమాచారం. ఈనేపథ్యంలోనే అధిష్టానం పునరాలోచనలో పడినట్టు, గంటా రాకపోతే నాగార్జునకే అవకాశం ఇవ్వనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇదే నియోజకవర్గం నుంచి వైసిపి తరపున అభ్యర్థిగా భావిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ ఇప్పటికే నియోజకవర్గంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన సంగతి తెలిసిందే. ఇటీవల మీసాల వరహాలనాయుడ్ని పార్టీలోకి చేర్చుకున్నారు. త్వరలో టిడిపిని టార్గెట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికైనా అభ్యర్థి ఎవరనేది టిడిపి అధిష్టానం ఖరారు చేయకపోతే ఈలోపే నియోజకవర్గాన్ని చక్కబెట్టుకుని, ఇతర నియోజకవర్గాలపై దృష్టి కేంద్రీకరించే పరిస్థితి ఏర్పడుతుందని కూడా చర్చనడుస్తోంది.


పాటదారులు రాక వేలం వాయిదా

పార్వతీపురం టౌన్ : జిల్లా కేంద్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ రోజువారీ మార్కెట్, మున్సిపల్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్ అశీలు వసూళ్లు చేసుకునేందుకు వేలం పాట, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న 22, 34, 36, 44, 45 షాపులకు వేలంపాట శనివారం జరగాల్సి ఉన్నప్పటికీ ఈ వేలంపాటలో పాల్గొనేందుకు పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో 8వ సారి వాయిదా పడడం విశేషం. అయితే ఈ వేలం పాటను ఈ నెల 7కు వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ పొందూరు సింహాచలం తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పలు గ్రామాల్లో రూ.350 లక్షలతో చేపట్టనున్నట్టు అభివృద్ధి పనులకు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర శనివారం శంకుస్థాపన చేశారు. మండలంలోని రాయిగుడ్డి వలస నుంచి భీమన్నదొర వలస వరకు రూ.80 లక్షలతో కిలోమీటరు బిటి రోడ్డు, తాడూరు నుండి కొండ తాడూరు వరకు కోటి రూపాయలతో 1.200 మీటర్లు బిటి రోడ్డు, పాచిపెంట బిటి రోడ్డు నుంచి బొబ్బిలివలస వరకు రూ.60లక్షలతో కిలోమీటరు బిటి రోడ్డు, పి.కోనవలస గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో రూ.కోటీ పది లక్షలతో వంటగది, భోజన శాల నిర్మాణ పనులకు ఐటిడిఎ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల నిర్మాణంతోనే ఏజెన్సీ మైదాన ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని నెల రోజుల వ్యవధిలో మండలంలో పంచాయతీరాజ్ శాఖ తరపున రోడ్లు, వంతెనలు, అదనపు భవనాలు, పలు అభివద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నామన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఎంపి, ఎమ్మెల్యే దేనికైనా పోటీకి సిద్ధం

రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపిదేనికైనా పోటీకి తాను సిద్ధమేనని, తమ నాయకుడు మాటే శిరోధార్యం రాజన్నదొర అన్నారు. నాడు రాజశేఖర్‌రెడ్డి భక్తుడిని నేడు జగనన్న సైనికుడ్ని అధిష్టానం ఆదేశిస్తే ఎమ్మెల్యే, ఎంపీ ఏ పదవికైనా పోటీకి తాను సిద్ధమే అంటూ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, పి.వీరంనాయుడు, మండల వైసిపి అధ్యక్షులు జి.ముత్యాలునాయుడు, టి.గౌరీశ్వరరావు, దండి ఏడుకొండలు, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ఐటిడిఎ ఈఎన్‌సి శ్రీనివాసరావు, ఇఇ శాంతీశ్వరరావు, డిఇ మణికుమార్, ఎఇ బి.సత్యనారాయణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకే మెగా వైద్య శిబిరం : ఎస్‌పి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులకు అండగా నిలిచేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. మండలంలోని కూనేరులో ఎంపిపి స్కూల్ ఆవరణలో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో తిరుమల మెడికవర్, కొమరాడ పిహెచ్‌సి, రెడ్ క్రాస్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరాన్ని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాలకు సహాయపడుతూ, వారికి అండగా నిలిచేందుకుగాను, కమ్యూనిటీ పోలీసింగులో భాగంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించామని అన్నారు. ఈ వైద్య శిబిరం నిర్వహించాలనే ఆలోచన రాగానే తిరుమల మెడికవర్ వైద్యులు, కొమరాడ పిహెచ్‌సి వైద్యులు సుమారు 10 మంది వైద్య బృందం, రెడ్ క్రాస్ సభ్యులు తమవంతు సహాయాన్ని, సేవలను అందించేందుకు ముందుకొచ్చారని కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. మెగా వైద్య శిబిరంలో కంటికి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఆప్తమాలజిస్టు, గుండెకు సంబంధించి కార్డియాలజీ, గైనకాలజిస్టు,జనరల్ సర్జన్, ఫిజీషియన్ వైద్యులు ఉన్నారని, వీటితో పాటు బ్లడ్ ప్రజర్, సుగర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వైద్యులు రాసిన మందులను కూడా ఉచితంగా అందిస్తామని, వాటిని సక్రమంగా వాడి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి, తగు జాగ్రతలు పాటించినట్లయితేనే ఈ వైద్య శిబిరం లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఎఎస్‌పి సునీల్ షరోన్ మాట్లాడుతూ మారుమూల గిరిజనులు ఆరోగ్యపరమైన ఇబ్బందులతో జీవిస్తూ తగిన వైద్యం పొందేందుకు అవసరమైన ఆర్థిక పరిస్థితుల్లేని కారణంగా ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా కంటి హృద్రోగం, గర్భాశయ సమస్యలు, ఇతర ఆరోగ్యపరమైన సమస్యల పరిష్కారానికి ఆయా రంగాల్లో నిపుణులను ఈ మెగా వైద్య శిబిరంలో పాల్గొనేలా ఎస్పీ చర్యలు చేపట్టారని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మెగా వైద్య శిబిరంలో సుమారు 500మంది గిరిజనులు మారుమూల గిరిజన గ్రామాల నుండి హాజరు కాగా, వారికి ఆప్తమాలజిస్టు, గైనిక్, జనరల్ సర్జన్లు వివిధ రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహించి, వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులను, రెడ్ క్రాస్ సభ్యులు, సేవలందించిన ప్రతి ఒక్కరికీ ఎస్‌పి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గిరిజన వృద్ధులకు, మహిళలకు చీరలు, గొడుగులు పురుషులకు టి-షర్ట్స్ , యువతకు వాలీబాల్ కిట్లు, షీల్డ్‌లను ఎస్‌పి అందజేశారు. అనంతరం ఈ వైద్య శిబిరానికి హాజరైన గిరిజనులకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో భోజన, వసతులను కల్పించారు. కార్యక్రమంలో పార్వతీపురం రూరల్ సిఐ కె.రవికుమార్, ఎస్‌ఐ దినకర్, కొమరాడ ఎస్‌ఐ కె.నీలకంఠం, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, తిరుమల మెడికవర్ వైద్యులు, కొమరాడ పిహెచ్‌సి వైద్యులు, రెడ్‌క్రాస్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.



గిరిజన వృద్ధురాలికి చీర, గొడుగు అందజేస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

పోరాడకుండా రాజన్నదొర ఎమ్మెల్యే ఎలా అయ్యారో?

పోరాటాలను హేళన చేయడం తగదు : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం రాజన్నదొర న్యాయ పోరాటం చేసిన తర్వాతనే మొదటి సారి ఎమ్మెల్యే అయ్యారన్న విషయం గుర్తు పెట్టుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు, ఎం.శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు వంతల సుందరరావు సూచించారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మొదటి సారి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు రాజన్నదొర ఓడిపోయారని, ఆ తర్వాత కులవివాదంపై న్యాయ పోరాటం చేసి విజయం సాధించారని గుర్తు చేశారు. అలాంటప్పుడు పోరాటాలతో ఏమీ రావని వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గిరిజన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనేకసార్లు సిపిఎం, గిరిజన సంఘాల పోరాటం వల్లనే సమస్యలు పరిష్కారమయ్యారని చెప్పారు. పట్టణంలో గిరిజన సహాయ సంక్షేమ అధికారి కార్యాలయం ఎత్తివేస్తే ఎస్‌ఎఫ్‌ఐ, గిరిజన సంఘాలు పోరాడడం వల్లే తిరిగి ఆ కార్యాలయం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. పట్టణంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలని ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం, ఎస్‌ఎఫ్‌ఐ సంఘాలు పోరాడడం వల్లనే ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. మెంటాడ మండలంలో దళిత, గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ పోరాటం చేస్తే హేళన చేయడం మంత్రికి తగదని చెప్పారు. కనీసం వారి వినతిపత్రం తీసుకోకుండా మంత్రి రాజన్నదొర అసహనం వ్యక్తం వ్యక్తం చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. కేంద్రంలోనిబిజెపి, రాష్ట్రం లో వైసిపి ప్రభుత్వాలు గిరిజనుల హక్కులను కాలరాస్తుంటే సిపిఎం, గిరిజన సంఘాలే పోరాడుతున్నాయని అన్నారు.

సీతానగరం బ్రిడ్జి పనులు మంజూరు చేయండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సీతానగరం బ్రిడ్జి పనులు మంజూరు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి వివిధ అంశాలను శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సీతానగరం బ్రిడ్జి అత్యవసరమని, ప్రతిపాదనలు సమర్పించడం జరిగిందని, మంజూరు చేయాలని కోరారు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందిస్తూ వివరాలు తనకు నేరుగా సమర్పించాలన్నారు. జిల్లాలో సర్వే పూర్తి అయిన ప్రదేశాల్లో సర్వే రాళ్లు పాతడం జరుగుతుందని, వేగవంతం చేస్తామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఇల సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. వేసవి దృష్ట్యా తాగు నీటిపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల ప్రదేశం వద్ద తాగునీరు అందుబాటులో ఉండాలని, షామియానాలు ఏర్పాటు చేసి నీడ కల్పించాలని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర వచ్చే చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జి జెసి సి.విష్ణు చరణ్, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, డిఎంహెచ్ఒ బి.జగన్నాథ రావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్ రిక్రూట్‌మెంట్

ప్రజాశక్తి - పార్వతీపురం

అగ్నిపథ్ పథకం కింద 2024-25 రిక్రూట్‌మెంట్ సంవత్సరానికి అగ్నివీర్ తీసుకోవడానికి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ విశాఖపట్నం వారు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. అగ్నిపథ్ పథకం కింద 2024-25 రిక్రూట్‌మెంట్ సంవత్సరానికి అగ్నివీర్ తీసుకోవడానికి ఆన్‌లైన్ ఎంపిక పరీక్ష కోసం పెళ్లికాని పురుష అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తును ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పార్వతీపురం జిల్లాకు చెందిన దరఖాస్తుదారులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్ 10వ తరగతి ఉత్తీర్ణత, అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్ 8వ తరగతి ఉత్తీర్ణత కేటగిరీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఆన్‌లైన్ ఎంపిక పరీక్ష కోసం రిజిస్ట్రేషన్ 13 ఫిబ్రవరి 2024 నుండి 22 మార్చి 2024 వరకు ఆన్‌లైన్‌లో (www.joinindianarmy.nic.in) దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మాత్రమే పరీక్షకు హాజరు కావడానికి అర్హులని తెలిపారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

ప్రజాశక్తి - పాలకొండ

ఆస్తి పన్నుల వసూళ్లలో మరోసారి ప్రభుత్వం వడ్డీ మాఫీ చేసిందని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాల్టీల్లోని ఆస్తి, ఖాళీ జాగాల్లో పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు, ఈ ఆర్థిక సంవత్సరం పన్నుపై విధించిన వడ్డీని వన్ టైమ్ మెజర్‌గా మాఫీ చేసినట్టు తెలిపారు. అయితే పన్ను చెల్లించాల్సిన పన్ను చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంతో సహా ఒకే సారి ఈనెల 31లోగా చెల్లించినట్లైతే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని అన్నారు. కావున ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వడ్డీ మినహాయింపు లబ్దిని పొంది ఆస్తి, ఖాళీ జాగా పన్ను బకాయిలను వడ్డీ లేకుండా ఒకే సారి చెల్లించాల్సిందిగా కోరారు. పన్నులు మున్సిపల్ ఆఫీసు ఇంటి పన్నుల వసూల కౌంటర్ నందు చెల్లించవచ్చన్నారు. అంతేకాక పన్నులను ఆన్-లైన్ ద్వారా (https://cdma.ap.gov.in) నెట్-బ్యాంకింగ్ ద్వారా కానీ, డెబిట్ / క్రెడిట్ కార్డు ల ద్వారా కానీ, UPI ద్వారా కానీ చెల్లించవచ్చున్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో సిఇఒ తనిఖీ

ప్రజాశక్తి -గరుగుబిల్లి

స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని జెడ్పీ ఇన్‌ఛార్జి సిఇఒ రాజకుమార్ ఆధ్వర్యంలో 2022-24 సంవత్సరం వరకు రికార్డులు తనిఖీ చేశారు. గతంలో పనిచేసిన ఎంపిడిఒ జి.పైడితల్లిపై ఆరోపణలు ఉన్నందున తమ బృందం తనిఖీ చేపట్టడం జరిగిందన్నారు. రికార్డులు సరిగ్గా లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. డిపార్ట్మెంట్ మెంటల్ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలో జెడ్‌పి ఎఒ తులసీనాథ్, జడ్పీ సీనియర్ అసిస్టెంట్ పిఎం. రవికుమార్, జడ్పీ జూనియర్ అసిస్టెంట్ బి. శ్రీధర్ పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం పై ఫిర్యాదు

మండలంలో పరిశీలన నిమిత్తం వచ్చిన సిఇఒ దృష్టికి నిధుల దుర్వినియోగంపై నాగూరు ఎంపిటిపి సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. గతంలో పనిచేసిన ఎంపిడిఒ అనేక అక్రమాలకు పాల్పడ్డారని, అలాగే బోరు వెల్ విభాగంలో తన రెండో కుమారుడ్ని నియమించుకున్నారని ఫిర్యాదు చేశారు. ఆమె హయాంలో జనరల్ బాడీ సమావేశాల్లో ప్రజాధనం దుర్వినియోగం చేశారని, బోరు వెల్ విభాగంలో నియమించిన వ్యక్తి ఎన్నడూ పనిచేసిన దాఖలాలు లేవని, విధుల్లో భాగంగా వాహనం ఏర్పాటు చేసుకున్నానని తెలిపినా ఆమె ఏ వాహనం వాడరో, డ్రైవర్ ఎవరో అన్న అంశం పై దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

సానుభూతి సరే... చిత్తశుద్ధి ఏదీ?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కష్టాల్లో ఉన్నవారిని కలిసి సానుభూతి చూపడం మానవతా ధృక్పథం. ఎదుటి మనుషులను జాలి, దయ, కరుణ, సానుభూతితో తార్కాలికంగా ఓదార్చవచ్చు. కానీ, వాటిలో చిత్తశుద్ధి లోపిస్తే అదే మనుషుల్లో తాము సాధించాలనుకున్న లక్ష్యంపై మరింత కసి, పట్టుదల పెరుగుతుంది. మిమ్స్ ఉద్యోగుల విషయంలో ప్రస్తుతం అదే జరుగుతోంది. మిమ్స్ యాజమాన్యం అందులోని ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం ద్వారా పనులకు దూరమయ్యే విధంగా వ్యవహరించి నెల రోజులు దాటింది. విధిలేని పరిస్థితుల్లో ఉద్యోగులంతా సిఐటియు నాయకత్వంలో సంఘటితమై ఫిబ్రవరి 1వ తేదీ నుంచి విధులకూ దూరమయ్యారు. నాటి నుంచి మిమ్స్ ఆసుపత్రి ఎదురుగా నిరసన శిబిరం నడపడంతోపాటు తిరగని చోటు లేదు. జిల్లా కలెక్టర్ మొదలుకుని డిసిఎల్, జెసిఎల్, చివరకు కార్మిక శాఖ కమిషనర్ వరకు వెళ్లి తమ సమస్యలు విన్నవించారు. ఈనేపథ్యంలో ఉద్యోగుల నిరసన దీక్షా శిబిరాన్ని ఇటు టిడిపి, జనసేన, అటు వైసిపి నాయకులు సందర్శిండం హర్షించదగినదే. కానీ, రాజకీయ పార్టీలు అంతటితో సరిపెట్టుకోవడంతో ఈ రెండు పార్టీలకు చెందిన నాయకుల్లోనూ చిత్తశుద్ధి లేదంటూ సంబంధిత ఉద్యోగులతోపాటు జిల్లాలో పబ్లిక్ టాక్.



మహాకవి గురజాడ అప్పారావు చెప్పిన 'ఒట్టిమాటలు కట్టిపెట్టి గట్టిమేల్ తలపెట్టవోయ్' అనే మాటలు అధికార పాలకపక్షాలకు బోధ పడడం లేదంటూ చాలా మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టాల్లోవున్న కార్మికులను పరామర్శించడం తప్ప, వారి తరపున పోరాడేందుకు ప్రయత్నించకపోవడమే ఇందుకు కారణం. ఒక మనిషి చేయలేని పని కొంతమందితో ఏర్పడిన సంఘం చేయగలుతుంది. ఒక సంఘం సాధించలేని సమస్యలు కొన్ని సంఘాలు కలిస్తే సాధ్యమౌవుతాయి. సంఘాలూ సాధించలేనివి రాజకీయ పార్టీల జోక్యంతో పరిష్కారమౌతాయి. ఇది చారిత్రక సత్యం. చరిత్ర నేర్పిన గుణపాఠం. కానీ, ఆయా రాజకీయ పార్టీల చిత్తశుద్ధిపైనే ఫలితాలు కూడా ఆధారపడి ఉంటాయి. మిమ్స్ ఉద్యోగుల పోరాటంపై అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు చూపిన మద్దతు, జాలి, సానుభూతి నేతి బీరకాయలో నెయ్యివెతికిన చందంగానే ఉంది. శిబిరాన్ని సందర్శించిన స్థానిక ఎమ్మెల్యేతోపాటు టిడిపికి చెందిన నాయకులు కూడా ఉద్యోగుల పోరాటం న్యాయమైనదేనని చెప్పారు. మిమ్స్ యాజమన్య వైఖరిని కూడా ఖండించారు. చివరకు ఇటీవలే జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దృష్టికి కూడా ఉద్యోగులు సమస్యలు తీసుకెళ్లారు. అయినా సమస్య పరిష్కారం కావడం లేదు? జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం కార్మికులు తమ సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారానికి ఆమె చొరవ చూపడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

అసలు.. ఈ సమస్యలు పరిష్కారం కాకుండా అడ్డుకున్నదెవరు? ప్రభుత్వ ఆదేశాలను మిమ్స్ యాజమాన్యం భేఖాతారు చేస్తుందా? లేక యాజమాన్యంతో ప్రభుత్వ పెద్దలే మిలాఖత్ అయ్యారా? ఇంత జరుగుతుంటే తామే ప్రతిపక్షం అంటున్న టిడిపి ఏం చేస్తున్నట్టు? మీడియాను మేనేజ్ చేస్తున్నది ఎవరు? ఉద్యోగులకు అండగా నిలిచిన సిఐటియు నాయకుల నిర్బంధాలు, అరెస్టులకు పోలీసులను ఉసుగొల్పుతున్నదెవరు? కార్మిక శాఖ అధికారులు ఉద్యోగుల వాదన వినకుండా, యాజమాన్య నిరంకుశ వైఖరిపై ఎందుకు అంత మెతకవైఖరి అవలంభిస్తోంది? ఇలా... వందల ప్రశ్నలు మిమ్స్ ఉద్యోగుల్లోనే కాకుండా సాధారణ ప్రజల నుంచి కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మిమ్స్ ఉద్యోగుల ఇబ్బందులపై అధికార, ప్రతిపక్షాలు మొసలి కన్నీరు కార్చడం ఆపేసి, ఉద్యోగుల కంటతడిని ఆపే విధంగా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని జనం కోరుతున్నారు.



బిఎల్‌ఒలకు అవగాహన కల్పిస్తున్న స్వీప్ నోడల్ అధికారి రాజశేఖర్

ఓటింగ్ పై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి -సీతంపేట

ఎన్నికల ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి రాజశేఖర్ అన్నారు. శనివారం పాలకొండ నియోజకవర్గంలోని బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమ, నిబంధనలను బిఎల్‌ఒలంతా తెలుసుకోవాలని అన్నారు. ఎన్నికలకు అందరూ సమాయత్తంగా కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ వివి రమణ, నాలుగు మండలాల తహశీల్దార్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిసిఎంఎస్ డైరెక్టర్ పదవికి పిరిడి రాజీనామా?

ప్రజాశక్తి - సాలూరు

డిసిఎంఎస్ డైరెక్టర్ పదవికి పిరిడి రామకృష్ణ రాజీనామా చేయనున్నట్లు తెలిసింది. గత కొద్ది నెలలుగా ఆయన వైసిపి నాయకత్వ తీరుపై అసంతృప్తితో ఉన్నారు. దీంతో పార్టీ సమావేశాలకు, కార్యక్రమాలకు దూరంగా వుంటున్నారు. పార్టీలో తనకంటూ గుర్తింపు లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో 20వార్డులో ఇంఛార్జిగా తనకు తగిన ప్రాధాన్యత లేదని అసంతృప్తితో రగిలిపోతున్నారు. డిసిసిబి డైరెక్టర్ పదవి ఇప్పిస్తామని చెప్పి డిసిఎంఎస్ డైరెక్టర్ పదవిని పార్టీ నాయకత్వం అంటగట్టిందని, ఇష్టం లేకపోయినా ఇంతవరకు కొనసాగానని చెప్పారు. కార్యకర్తగా పార్టీ లో కొనసాగుతానని తెలిపారు.



ఆర్‌టిసి డిపోను పరిశీలిస్తున్న చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

ఆర్‌టిసి డిపో తనిఖీ

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక ఆర్టీసీ డిపోను ఏపీఎస్ఆర్టీసి జోన్-1 డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు శనివారం సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ డిపోలో సిబ్బందిని ఉద్దేశించి తనిఖీలు చేస్తూ అక్కడ ఉన్న డ్రైవర్లను, కండక్టర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సర్వీస్ అందించాలని తెలిపారు. ప్రమాదాలు తగ్గించి, ఇంధనం ఆదా చేయాలన్నారు. ప్రస్తుత సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని సుశిక్షితులైన డ్రైవర్లను తయారుచేసే ఉద్దేశంతో అనుభవమున్న శిక్షకులను, మెకానికల్ సిబ్బందిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ డిపో మేనేజర్ వెంకటేష్, రఘు పాల్గొన్నారు.



నర్సరీలో చెలరేగుతున్న మంటలు

నర్సరీకి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల తహశీల్దార్ కార్యాలయానికి సమీపంలో హుకుంపేటలో వద్ద కురుపాం అటవీ రేంజ్ పరిధిలోని గతంలో నిర్వహించిన సోషల్ ఫారెస్ట్ నర్సరీకి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఫలితంగా నర్సరీలో ఉన్న టేకు మొక్కలు కాలిపోయాయి. గతంలో నిధులు పుష్కలంగా ఉన్న సమయంలో ఇదే నర్సరీలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి టేకు విత్తనాలు వేసి మొక్కలు తయారు చేసి లబ్దిదారులకు, అటవీ ప్రాంతంలో నాటేందుకు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నాటేందుకు వినియోగించే వారు. సోషల్ ఫారెస్ట్ నర్సరీ నిర్వహించేందుకు ఏటా ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసేది. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సమక్షంలో నర్సరీ నిర్వహించే వారు... నేడు నర్సరీ ఎక్కడ ఉందో సిబ్బంది కే తెలియని పరిస్థితి ఏర్పడింది.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కురుపాం

ఎపి మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశాలకు ఈనెల 1నుంచి 31 వరకు www.cse.ap.gov.in or www.apms.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో ఐదో తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉన్న విద్యార్థులు అప్లై చేసుకోవచ్చుని స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి తెలిపారు. ఒసి, బిసి కులాలకు చెందిన విద్యార్థులు 01-09-2012 - 31-08- 2014 మధ్య పుట్టి ఉండాలి. ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన విద్యార్థులు 01-09- 2010, 31-08-2014 మధ్య పుట్టి ఉండాలని సూచించారు. పరీక్షా రుసుము ఒసి, బిసిలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75, ఆరో తరగతి ప్రవేశాలపై ప్రవేశ పరీక్షలో ఒసి, బిసి విద్యార్థులు 35 మార్కులు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కనీసం 30 మార్కులు పొందాలన్నారు. ఏప్రిల్ 21న ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంతర్రాష్ట్ర రహదారిపై గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి - కొమరాడ

అంతర్రాష్ట్ర రహదారిని బాగు చేసే పరిస్థితిలో అధికారులు, ప్రజాప్రతితులు లేరని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి విమర్శించారు. కోటిపాం సర్పంచ్ సుంకరి సుగుణమ్మ భర్త వెంకటరమణ సహాయంతో శనివారం గుమడ, కోమట్లపేట సమీపాన గల అంతరాష్ట్ర రహదారిపై గల పెద్దపెద్ద గోతులు కప్పారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో కొంతమంది సహాయ సహకారంతో ఈ గోతులను కప్పుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి పార్వతీపురం -కూనేరు మూడు రాష్ట్రాల అంతర్ రాష్ట్ర రహదారిపై ఏర్పడ్డ పెద్దపెద్ద గోతులను కప్పించి వాహదారులను, ప్రయాణికులను ప్రాణాలను కాపాడాలని కోరారు.

నేడు జనసేన ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని సౌందర్య థియేటర్ జంక్షన్ రోడ్ ఉన్న జనసేన కార్యాలయంలో ఆదివారం ఉదయం 10గంటలకు మున్సిపల్ పరిధిలో ఉన్న 30 వార్డుల్లో ఉన్న జనసేన కార్యకర్తలకు, నాయకులకు, మహిళలుకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు ఆ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అందరూ హాజరై తమ అభిప్రాయాలను కార్యకర్తలతో పంచుకోవాలని కోరారు.

హెల్మెట్ ధరించండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని శ్రీ సాయిరాం డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా కార్యక్రమంలో రెండోరోజు అడ్డాపుశీలలో కాలువల్లో పూడికలు తీస్తూ పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పార్వతీపురం పట్టణ కూడలిలో సిఐ, ఎస్ఐ సహాయ సహకారాలతో ద్విచక్ర వాహనదారులను హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోమని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పెంట అప్పారావు, ప్రిన్సిపల్ శ్రీధర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ డి.దేవి, తిరుపతి, రాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడే పల్స్ పోలియో

ఏర్పాట్లు పూర్తి : డిఎంహెచ్‌ఒ జగన్నాథరావు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అయిదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు తెలిపారు. తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలు తెలిపారు. పల్స్ పోలియో విజయవంతానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈనెల 3న (ఆదివారం) నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలో 98,991 మందికి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమం నిర్వహణకు గాను జిల్లాలో 42 మొబైల్ టీములు, 19 ట్రాన్సిట్ టీములు, 980బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఐదేళ్లలోపు గల 98,991 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రానికి సరిపడా వ్యాక్సిన్, ప్రచార సామగ్రి, ఇతర సామగ్రి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమం పర్యవేక్షణకు అవసరమైన సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. ఇటుక బట్టీల్లో పనిచేసే వారు, మత్స్యకారులు నివసించే ప్రాంతాలను గుర్తించి వారికి వ్యాక్సినేషను వేసేందుకు ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. ఐదేళ్లలోపు పిల్లల తల్లిదండ్రులు సమీపంలో ఉన్న పల్స్ పోలియో కేంద్రానికి వెళ్లి వ్యాక్సిన్ వినియోగించుకోవాలని కోరారు. హైరిస్క్ ఏరియాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం పల్స్‌పోలియో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం.నారాయణ, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



భామినిలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్యాధికారులు జగన్నాథరావు, నారాయణ, జగన్మోహన్

సీతానగరం : మండలంలోని సీతానగరం, పెదఅంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పావని, రాధాకాంత్ ఆధ్వర్యంలో ఆటో ప్రచారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 6 నుంచి గ్రామాల్లో పల్స్ పోలియో చుక్కలను రామ మందిరాలు అంగన్వాడీ కేంద్రాలు పాఠశాలల్లో వేయడమవుతుందని తెలిపారు. అలాగే బస్టాండు, రైల్వేస్టేషన్ వద్ద పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎస్‌వి రమణ, భవాని, సూర్యనారాయణ, హెచ్ఎస్ గోపాలం, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలో ఈనెల 3న జరగనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి మాట్లాడుతూ గ్రామాల్లో కూడా తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు వీలుగా ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఒ.శాంత కుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని బాలేరు, బత్తిలి, భామిని పిహెచ్‌సిల పరిధిలో గల గ్రామాల్లో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్యాధికారులు ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. వైద్యాధికారులు పి.సోయల్, దీపికారాణి, కె. రవీంద్ర మాట్లాడుతూ మండలంలో 45 పల్స్ పోలియో బూత్ కేంద్రాల ద్వారా, 3247 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ, సచివాలయాల్లో పల్స్ పోలియో అవగాహన పోస్టర్లు అతికించి, అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వైద్యులు దామోదర్, సంతోష లక్ష్మి,శివ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు న్యాయం జరగాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రజల కోసం మనం సేవ చేస్తున్నామని, వారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సమానత్వంతో ఒకే కుటుంబలా పనిచేయాలని ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ అధికారులకు ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి డి.వెంకటరమణనాయుడు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. చిన్నపాటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు చొరవ చూపాలని, అదనపు బాధ్యత తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కాలంలో మండలంలో అన్ని గ్రామాల్లో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్థాయిలో వచ్చిన సమస్యలపై పరిష్కరించినట్టు వారు స్పష్టం చేశారు. ఈ కారణంగా గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసి గ్రామాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో జూనియర్ లైన్‌మెన్ల పనితీరు అధ్వానంగా ఉందని, వారిని పనిలో పెట్టాలని ఎఇ బాలాజీని ఆదేశించారు. మూడు, నాలుగు మండల సమావేశాల్లో చెప్పినా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి ఎఇఒ కృష్ణకాంత్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన నువ్వులు, పెసర అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించామన్నారు. అలాగే ధాన్యం డబ్బులు జనవరి 18 నుండి ఎవరికీ పడలేదని వీటిపై సివిల్ సప్లై అధికారులకు నివేదించినట్టు తెలిపారు. ట్రాన్స్‌కో ఎఇ మాట్లాడుతూ వేసవిలో కరెంటు సమస్య లేకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని ఇక విద్యుత్ సమస్య ఉండదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రేగులపాడు, ఆడారు, తూడి, గ్రామస్తులు మాట్లాడుతూ గత సమావేశంలో కూడా విద్యుత్ సమస్య పరిష్కరించాలని విన్నవించిన సమస్య పరిష్కారం కాలేదని వారన్నారు. పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు మాట్లాడుతూ ప్రధాన ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడిచి పెట్టినప్పటికీ సగం భూములకే నీరు కలిసిందని, మిగిలిన భూములకు సాగునీరందలేదని సభ ముందుకు తీసుకురాగా ఎంపిపి కలుగజేసుకొని తోటపల్లి బ్యారేజ్‌లో నీరు లేనందున సాగునీరు నిలిపివేసినట్లు ఆయన వివరణ ఇచ్చారు. గృహ నిర్మాణ శాఖ సంబంధించి ఎఇ దిలీప్ కుమార్ మాట్లాడుతూ మండలంలో గహ నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయన్నారు. సభ్యులు కర్రి లీలాప్రసాద్, గోవిందరావు, మరికొంత సొంత స్థలాలు ఉన్నవారికి గృహాలు నిర్మించుకున్నందుకు అవకాశం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ వాటి అనుమతుల కోసం 1564 స్థలాలకు సంబంధించి డిపిఆర్‌కి పంపించామన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం, జడ్పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపిపి పి.విజయ కుమారి, ఎఎంసి వైస్ చైర్మన్ పి.లక్ష్మణరావుతో పాటు పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తూడిలో ఉపాధి హామీ చట్టం నిధులతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా, వైయస్సార్ హెల్త్ క్లినికులను స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ప్రభుత్వ విప్ పి.విక్రాంత్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఆయా సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, ఉపాధ్యక్షులు పి.విజయకుమారి, జడ్పిటిసి జంపు కన్నతల్లి-ఉమామహేశ్వరరావు, సర్పంచ్ కె.వెంకటరమణ, బిటివాడ వైద్యాధికారి మానస, పాలకొండ ఎఎంసి వైస్ చైర్మన్ పి.లక్ష్మణరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కె.లీలాప్రసాద్, వైసిపి నాయకులు పి.ధవళేశ్వరరావు, సిహెచ్ వెంకటరమణ, కేశవ, సచివాలయ కార్యదర్శి పి.చిన్నారావు, సచివాలయ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ పట్టాలు పంపిణీ

అనంతరం మండలంలోని ఎంవి పురం, బిటివాడ, నడిమికెళ్ల గ్రామస్తులకు జగనన్న ఇళ్ల స్థలాలతో పాటు భూ పట్టాలను స్థానిక ఎమ్మెల్యే కళావతి, ప్రభుత్వ విప్ విక్రాంత్ స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పట్టాలు పంపిణీ చేశారు. ఎంవిపురం గ్రామస్తులు ఎన్నో ఒలుగా సాగు చేస్తున్న భూములకు భూ హక్కు పత్రాలు కల్పించడంతో ఆ గ్రామ సర్పంచి పి.వెంకటరమణతో పాటు గ్రామస్తులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలిపారు.

మన్యంలో బాబు షూరిటీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సంతమల్లి, దారిమల్లి, మల్లి కాలనీ, నాయుడు మల్లి, కూసిమి గూడలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా బాబుషూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ స్థానిక మహిళలతో మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న వివిధ సమస్యల గురించి తెలుసుకున్నారు. త్వరలోనే మనందరి ప్రభుత్వం వస్తుందని, మన సమస్యలన్నింటికీ పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. ఈ అసమర్థ ప్రభుత్వం వల్ల మన రాష్ట్రంలో ప్రతి ఒక్కరు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, సీనియర్ నాయకులు సీమల కృష్ణారావు, సీనియర్ నాయకులు నిమ్మక నాగేశ్వరావు, పాలక ఆదినారాయణ, కుంబిరిక రామారావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ నిమ్మక చంద్రశేఖర్, ఉయిక సత్యం, బిడ్డిక స్వామినాయుడు, నిమ్మక మురళి, మూటక అప్పారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని కూర్మరాజుపేటలో బాబుషూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఈ ఐదేళ్లలో యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగం మరింత పెంచి పోషించిందని అన్నారు. యువత జీవితం బంగారు బాటలు వేయాలంటే రాబోయే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆమదాల పరమేష్, పిన్నింటి ప్రసాద్ బాబు, శ్యామ్, బూసతవుడు, సర్పంచ్ నళిని, బాలాజీ, కృష్ణ, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపించండి : జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం : టిడిపితోనే గిరిజన అభివృద్ధి సాధ్యమవుతుందని కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మారుమూల కొండలపైనున్న జర్మ పంచాయతీ బబ్బిడిలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. గిరిజన యువతకు ఉపాధి కల్పన, గిరిజనుల హక్కులు, చట్టాలకు రక్షణ ఉండాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు హయాంలో గిరిజన గ్రామాలకు రోడ్లు, ప్రతి గ్రామానికి కొళాయిలు ఇచ్చే ఘనత చంద్రబాబుకే చెందుతుందన్నారు. 2024లో బాబు ముఖ్యమంత్రి గెలిచిన వెంటనే మండలంలో డోలీల బెడద ఉండదని, ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తానని, వైసిపి ఎత్తివేసిన అనేక గిరిజన సంక్షేమ పథకాలను మళ్లీ పునరుద్ధరిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో అందరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థి ని అత్యధిక మెజార్టీతో కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె కోరారు. బబ్బిడిలో 150 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలోకి చేరాయి. నిజమైన స్వచ్ఛమైన గిరిజన అభ్యర్థిని ఎమ్మెల్యేగా ప్రకటించినందుకు సంఘీభావంగా కురుపాం నియోజకవర్గంలో టిడిపిని గెలిపించుకోవాలనే ధృఢ సంకల్పంతో ఆ పార్టీలోకి చేరామని వారు తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ కీలక దాసు, యూనిట్ ఇన్చార్జ్ అనిల్ కోటి సోమేశ్వరరావు, ఎక్స్ సర్పంచ్ ధర్మ తదితరులు ఉన్నారు.



సాలూరు మండలంలో కూర్మరాజుపేటలో ప్రచారం చేస్తున్న సంధ్యారాణి




గుమ్మలక్ష్మీపురం మండలం బబ్బిడిలో ప్రచారం చేస్తున్న జగదీశ్వరి

సోషల్ ఆడిట్‌కు సిద్ధంగా ఉండాలి : ఎఒ

ప్రజాశక్తి - బలిజిపేట

2023-24 రబీ సీజన్లో ఇ-క్రాప్‌లో నమోదైన పంటల వివరాలను విధిగా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించాలని గ్రామసభలు నిర్వహించి వివరాలను చదివి రైతులకు వినిపించాలని మండల వ్యవసాయ అధికారి ఎం.శ్రావణ్ కుమార్ నాయుడు అన్నారు. మండలంలోని వంతరాం రైతు భరోసా కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రదర్శించిన ఇ-క్రాప్ ముసాయిదా జాబితాను పరిశీలించిన అనంతరం ఇ-పంట నమోదులో ఏవైనా చిన్న చిన్న తప్పులు దొర్లినట్లయితే సరి చేసుకోవడానికి ఇదే చివరి అవకాశమని అన్నారు. కావున ఇ-పంటలో నమోదైన రైతుల వివరాలను గ్రామసభల్లో చదివి వినిపించడమే కాకుండా ఆర్‌బికెల్లో ప్రదర్శించాలని అన్నారు. అలాగే రైతు గ్రూపుల్లోనూ, వాట్సాప్‌ల ద్వారా తెలియజేయాలని, ఏవైనా అభ్యంతరాలుంటే వ్యవసాయ కమిషనర్ వారు సూచించిన ప్రొఫార్మాలో రాతపూర్వక ఫిర్యాదులను స్వీకరించి వాటిని కరెక్షన్ మాడ్యూల్‌లో అప్లోడ్ చేసి తప్పులను సవరించాలని తెలిపారు. సర్పంచులకు, ఎంపిటిసి సభ్యులకు, ఇతర ప్రజా ప్రతినిధులు, పెద్దలకు, గ్రామ వ్యవసాయ సలహా మండలి సభ్యులకు అందరికీ వివరాలను పూర్తిగా తెలియజేయాలని కోరారు. ఆదివారంలోగా అభ్యంతరాలు రాత పూర్వకంగా తెలపాలని, సవరణలు పూర్తి చేసి మార్చి 7నాటికి తుది జాబితా తయారు చేసేందుకు వీలుంటుందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎటువంటి మార్పులు, చేర్పులు చేయడానికి వీలుపడదనీ ఇ- క్రాప్ నమోదు చేసుకున్నట్లు మీ సెల్ ఫోన్ నంబర్‌కు మెసేజ్ పంపిస్తారని, ఇ -పంట నమోదు పత్రాన్ని ప్రింట్ తీసి రైతులకు ఇవ్వనున్నట్టు తెలిపారు. కావున రైతులంతా తమ పంటల నమోదు వివరాలను తెలుసుకొనేలా విస్తృతంగా తెలియజేయాలని విఎఎలను ఆదేశించారు. రైతులు కూడా భాగస్వాములై ఇ- పంట సోషల్ ఆడిట్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు, విఎఎ సాయి, వాలంటీర్లు పాల్గొన్నారు.



బలిజిపేట : ఇ-క్రాప్ నమోదు జాబితాను గ్రామసభలో వినిపిస్తున్న వ్యవసాయాధికారి

సీతానగరం : మండలంలోని చినబోగిలి రైతు భరోసా కేంద్రంలో శనివారం ఇ-పంట నమోదు సామాజిక తనిఖీని ఎఒ ఎస్.అవినాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ-పంట నమోదు సామాజిక తనిఖీ ఈనెల 1నుంచి 5 వరకు కొనసాగుతుందని, అన్ని ఆర్‌బికెల్లో రైతుల యొక్క ఇ-క్రాప్ పంట నమోదును పరిశీలించి, రైతులకు కూడా నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలోనూ రైతుల పేర్లను అందులో పొందుపరచబడతాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సౌజన్య రైతులు పాల్గొన్నారు.

పాచిపెంట : ఇ - క్రాప్ సోషల్ ఆడిట్లో భాగంగా రైతు భరోసా కేంద్రాల వద్ద ఇ-క్రాప్ జాబితాను మార్చి 1 నుంచి 3 వరకు ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ఇ-క్రాప్ నమోదు పూర్తి పారదర్శకంగా జరగాలనే ఉద్దేశంతో ఇ-పంట నమోదు వివరాలను రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శన జరుగుతుందన్నారు. అలాగే రైతుల సమావేశాలు నిర్వహించి ఈనెల 3 వరకు ఇ-పంటలో నమోదైన వివరాలను రైతులకు తెలియజేస్తామని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. పాంచాలి, మాతుమూరు ఆర్‌బికెల వద్ద ఇ-పంట జాబితా ప్రదర్శనను పరిశీలించారు. ఇ- పంట జాబితాలో నమోదైన తప్పులను రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్న దరఖాస్తు ద్వారా తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఈనెల 5 వరకు సవరించిన చివరి జాబితాను ఈనెల 8న ఆర్‌బికెల్లో అందుబాటులో ఉంటుందని, కావున రైతులంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు, అన్యాక్రాంతమైన భూములకు పట్టాలు ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివున్నాయుడు డిమాండ్ చేశారు. ఇందుకోసం ఈనెల 5న కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు నాయకులు కూనేరు సంతలో ర్యాలీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు శివున్నాయుడు, నాగేశ్వరరావు, బాబురావు, రాము, కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ జిల్లాలో తరతరాలుగా గిరిజనులు సాగు చేస్తున్న ప్రభుత్వ బంజర భూములకు డి-పట్టాలు ఇవ్వాలని, అలాగే అన్యాక్రాంతమైన పేదల పట్టా భూములు తిరిగి వారికి ఇవ్వాలని కోరారు. అలాగే 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

దేవునిగుంపకు ప్రత్యేక బస్సులు వేయండి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఈనెల మహాశివరాత్రి సందర్భంగా కొమరాడ మండలంలోని దేవునిగుంపకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు వేయాలని ఆ ఆలయ ఇఒ మండల ప్రసాదరావు ఆర్టీసీ డిపో మేనేజర్ దుర్గనుకోరారు. ఈ సందర్భంగా ఆమెకు శనివారం వినతి పత్రాన్ని అందిస్తూ మాట్లాడారు. మహాశివరాత్రి మహెూత్సవాలను పురస్కరించుకొని ఈనెల 8, 9 తేదీల్లో దేవునిగుంపులో ఉన్న సోమేశ్వరస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు ఒడిస్సాతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, ఇతర జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో రానున్నారని తెలిపారు. కావున ఈనెల 8, 9వ తేదీల్లో ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడపాలని అన్నారు. దీనికి డిపో మేనేజర్ స్పందిస్తూ ప్రత్యేక బస్సులను నడిపేందుకు హామీ ఇచ్చారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

భామిని : రానున్న ఎన్నికలకు వైసిపి నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ తోట సింహాచలం తెలిపారు. శనివారం మేం సిద్ధం -మా బూతు సిద్ధం కార్యక్రమంలో భాగంగా వైసిపి కన్వీనర్, జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ మండలం లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అనంతరం బాలేరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటు మేలు చేసే వాడికే వేసి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మెడిబోయిన జగదీశ్వరరావు, సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపిటిసి పాలక ఉషారాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.